సాక్షి వికారాబాద్

గురువారం ၊ 13 ၊ ఫిబ్రవరి ၊ 2025



మామూళ్ల మత్తు..

ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో నడవడానికి తీవ్ర అవస్థలు పడుతున్నామని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8లో



బర్డ్ ఫ్లూ కలవరం!

పౌల్ట్రీ రైతులను కొత్త భయం వెంటాడుతోం ది. బర్డ్ ఫ్లూ సోకి కోళ్లు మృత్యువాత పడడం తో ఆందోళన చెందుతున్నారు. 8లో



గ్రూప్‌లు పక్కన పెట్టండి

గ్రూప్ రాజకీయాలు పక్కనపెట్టి పార్టీ కోసం పని చెయ్యాలని ఎమ్మెల్యే బయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. 9లో

న్యూస్‌రీల్

జయంత్యుత్సవాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న గిరిజనులు

దుద్యాల్: సేవాలాల్ జయంతి ఉత్సవాలకు హాజరవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు నగరంలోని సీఎం నివాసంలో 15న కొడంగల్‌లో నిర్వహించే ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రిక అందజేశారు. ముఖ్యమంత్రిని ఆహ్వానించిన వారిలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శివ చౌహాన్, జనరల్ సెక్రటరీ శంకర్ నాయక్, దుద్యాల్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవినాయక్, మాజీ సర్పంచ్ రెడ్యానాయర్, గిరిజన నాయకులు సంతోశ్ రాంచందర్, భానునాయక్, రాములు నాయక్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్



శివ పూజలో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్ కుమార్

అనంతగిరి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ మండల పరిధిలోని పీలారం గ్రామంలో నిర్వహించిన శివ పూజకు హాజరయ్యారు. ప్రత్యేక పూజల అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

నేడు లగచర్ల రైతులతో కలెక్టరేట్‌లో సమావేశం

తహసీల్దార్ కిషన్

దుద్యాల్: మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులకు గురువారం కలెక్టరేట్ సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిషన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని లగచర్లలో సర్వే నంబర్ 102, 117, 120, 121లో 110.32 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించిన రైతులు తప్పక హాజరవ్వాలని సూచించారు.

15న జాబ్ మేళా

అనంతగిరి: వికారాబాద్‌లోని ఐటీఐ కళాశాలలో ఈ నెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన శాఖ జిల్లా అధికారి సుభాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీని అగ్రి ల్యాబ్స్‌లో 50 పోస్టుల భర్తీకి ఈ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని చెప్పారు. వివరాలకు 96760 47444 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

చిరుత సంచరిస్తోంది

అనుమతి లేనిదే అడవిలోకి ప్రవేశించొద్దు



అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు


అనంతగిరి: అనంతగిరి అడవుల్లో చిరుత పులి మంగళవారం రాత్రి సంచరించిన విషయం అందరికీ తెలిసిందే. ఈ విషయమై అటవీశాఖ అధికారులు అడవిలోకి అనుమతి లేకుండా ఎవరు ప్రవేశించొద్దని బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కాగా చిరుత పులి ఎక్కడ సంచరిస్తుందనే విషయాన్ని అటవీ శాఖ అధికారులు పరిశీలించనున్నారు.

వీరు మారరా..?

తరచూ ఏసీబీకి చిక్కుతున్న అవినీతి అధికారులు

ఒకప్పుడు అవినీతి నిరోధక శాఖ పేరు వినిపిస్తేనే అధికారులు హడలిపోయేవారు. ప్రస్తుతం లంచం తీసుకోవడం.. ఏసీబీకి చిక్కడం.. సాధారణమయింది. వారికి చిక్కినా మళ్లీ ఉద్యోగం ఉంటుందనే భరోసా లంచావతారులుగా మారుస్తోంది. నెల గడవక ముందే ముగ్గురు అధికారులు ఏసీబీకి చిక్కడం కలకలం రేపుతోంది.

- ముఖ్యమంత్రి సొంత జిల్లాలో డబ్బులిస్తేనే పని
- అక్రమార్కులకు నేతల అండదండలు
- తాజాగా రూ.30 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఎస్‌ఐ
- మరికొన్ని శాఖలపైనా ఏసీబీ నజర్





ఏసీబీకి పట్టుబడిన ధారూరు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్(ఫైల్)

వికారాబాద్/ధారూరు: ముఖ్యమంత్రి, శాసన సభాపతి సొంత ఇలాకాలో కీలక శాఖల్లో పనిచేస్తున్న అధికారులు లంచావతారులుగా మారారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో తరచూ చోటు చేసుకుంటున్న ఘటనలు ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. ధారూరు ఎస్‌ఐ, అతని డ్రైవర్ మంగళవారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన విషయం విదితమే. ఓ మైనర్‌ను కేసు నుంచి తప్పించడంతో పాటు మిగిలిన వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు జరిగిన ఒప్పందంలో భాగంగా ఈ డబ్బు తీసుకున్నట్లు సమాచారం. బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో అవినీతి నిరోధక శాఖ అధికారుల బృందం వేసిన వలలో ధారూరు ఠాణా ఎస్‌హెచ్‌ఓగా పనిచేస్తున్న ఎస్‌ఐ, అతని డ్రైవర్ లంచం తీసుకుంటూ చిక్కారు. ఈ మేరకు వారిని బుధవారం రిమాండ్‌కు తరలించారు. గతేడాది డిసెంబర్‌లో తాండూరులో ఓ తహసీల్దార్, ఆర్‌ఐ క్యాడర్ అధికారులు పెద్ద మొత్తంలో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కి రెండు నెలలు గడవకముందే ధారూరు ఘటన జరగడంతో జిల్లా యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కి పడింది.

నేతల అండదండలు..?

అవినీతి అధికారులకు నేతలు, ప్రజా ప్రతినిధుల అండదండలున్నాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులకు ముడుపులు చెల్లించి పోస్టింగులు తీసుకుని వస్తున్న అధికారులు వసూళ్లకు తెగబడుతున్నారు. పోస్టింగ్‌కు వెచ్చించిన సొమ్ము ఎలా పూడ్చుకోవాలని కొందరి ముందు అధికారులు మొహమాటం లేకుండా చెబుతున్నారట. దీంతో ఉన్నత స్థాయి పర్యవేక్షణాధికారులకు ఇది అడ్డంకిగా మారుతోంది. న్యాయం కోసం స్టేషన్ మెట్లెక్కితే ఎస్‌ఐ జలగలా పీడిస్తున్నారని.. రాజీ పేరిట బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని వేణుగోపాల్ గౌడ్ వచ్చిన నాటి ఇదే తంతు కొనసాగుతోందని ఆరోపణలున్నాయి. డిపార్ట్‌మెంట్ డ్రైవర్‌ను పెట్టుకోకుండా ప్రైవేట్ డ్రైవర్‌ను ఏర్పాటు చేసుకుని అక్రమ వసూళ్లు చేశారని పోలీసులే చెప్పడం గమనార్హం. డ్రైవర్ వసూలైన డబ్బులో చేతివాటం ప్రదర్శించడంతో కొత్త డ్రైవర్‌ను నియమించుకుని ఇసుక ట్రాక్టర్లు, లోడ్‌తో వెళుతున్న లారీల డ్రైవర్లను బెదిరించి డబ్బు వసూలు చేశాడని పలువురు ఆరోపిస్తున్నారు. నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి రూ.వేలల్లో వసూలు చేయడం ధారూరు ఠాణాలో చూశామని బాధితులు వాపోతున్నారు. కేసు ఏదైనా డబ్బు ముట్టజెప్పాల్సిందేనని ఫిర్యాదుదారులు, నిందితులు బాహాటంగానే చెబుతున్నారు. రెవెన్యూ, హెల్త్, పోలీస్, మున్సిపల్ శాఖల్లో విధులు నిర్వహించే పలువురిపై ఏసీబీ అధికారుల నిఘా కొనసాగుతున్నట్లు సమాచారం.

ఏసీబీ వలలో జిల్లా యంత్రాంగం

తాజాగా పోలీసు శాఖలో పనిచేసే ఎస్‌ఐ అతని డ్రైవర్ లంచం తీసుకుంటూ పట్టుబడగా.. ఇరవై రోజుల క్రితం తాండూరులో ఇద్దరు రెవెన్యూ అధికారులు లంచం తీసుకుంటూ పట్టుబడిన విషయం తెలిసిందే. ఇలా తరచూ బాధితులు లంచావతారుల బాధలు తట్టుకోలేక ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తూనే ఉన్నారు. గతంలో తాండూరులో ఓ సబ్ రిజిస్ట్రార్, పరిగిలో ఎంపీడీఓ, ఈజీఎస్ ఉద్యోగులు, డిప్యూటీ తహసీల్దార్, వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో ఓ పోలీసు అధికారి, వికారాబాద్‌లో ఓ ఇంజనీర్ లంచాలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విషయం విదితమే. తాజాగా పట్టుబడిన వారు పోలీసు, రెవెన్యూ శాఖలకు సంబంధించిన వారు కాగా.. మిగిలిన శాఖల్లోనే ఇదే పరిస్థితి దాపురించిందని బాధితులు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, మైనింగ్, సబ్ రిజిస్ట్రార్, ఎస్టీఓ, డీటీఓ, ఆర్టీఏ, పోలీస్ డిపార్ట్‌మెంట్ ఏదయినా సరే పర్సెంటేజీలు వసూలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. వీరు చేసిన వసూళ్లో నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి ప్రజా ప్రతినిధులకు సైతం ముడుపులు అందుతాయని అందుకే వారు కూడా నోరుమెదపరని ఆరోపణలున్నాయి.

జిల్లాలో మరి కొందరిపై నిఘా!

తాజా ఘటన నేపథ్యంలో ఆ శాఖ ఉన్నతాధికారులు ఘటనపై చర్చించి పునారవృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించినట్లు తెలుస్తోంది. తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని అమాయకుల వద్ద డబ్బు తీసుకుని రూ.కోట్లతో ఉడాయించిన కేసులో దీపక్ వైష్ణవ్ అనే వ్యాపారి నుంచి రూ. 30లక్షల వరకు వసూలు చేసి కేసు నీరుగార్చారనే ఆరోపణలున్నాయి. ఇటీవల ఓ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదుకాగా అతన్ని అరెస్టు చేయకుండా ఉండేందుకు పెద్దమొత్తంలో లంచం తీసుకున్నారని సమాచారం. కేసు నమోదు చేసి 70 రోజులు గడిచినా నిందితుడిని అరెస్టు చేయకుండా తాత్సారం చేశారనే ఆరోపణలు వినిపించాయి. దీంతో ఉన్నతాధికారులు ఆ కేసు సీసీఎస్ పోలీసులకు అప్పగించగా వారు 24 గంటల్లో నిందితులను అరెస్టు చేశారు. గత డిసెంబర్‌లో ఐదుగురు ఆర్‌ఎంపీ డాక్టర్లపై మెడికల్ కౌన్సిల్ సభ్యులు కేసు నమోదు చేయగా వీరికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ.1.10లక్షలు తీసుకున్నట్లు బాధితులు చెబుతున్నారు. వికారాబాద్‌తో పాటు పరిగి, కొడంగల్, తాండూరు సర్కిళ్ల పరిధిలోనూ కొందరు ఎస్‌హెచ్‌ఓలతో పాటు పర్యవేక్షణాధికారులమీద ఆరోపనలు వస్తున్నాయి. పరిగి సబ్ డివిజన్ పరిధిలో ఓ బోరు బండిని పట్టుకుని వదిలేసిన కేసులో, రేసింగ్‌కు వినియోగించే పావురాలను పట్టుకున్న కేసులోనూ పెద్ద మొత్తంలో ముడుపులు అందినట్టు ప్రచారం జరుగుతోంది. రోజు వారీగా కేసులు నమోదులో వచ్చే మామూళ్లతో పాటు కొందరు ఎస్‌హెచ్‌ఓలు నెలవారీ మామూళ్లు మాట్లాడుకుని వ్యవహారం నడిపిస్తున్నారనే విమర్శలున్నాయి.రేషన్ బియ్యం, కిరోసిన్, అక్రమ ఇసుక, మట్టి, కలప రవాణా చేసే వ్యక్తులతో పాటు మద్యం దుకాణాల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నట్టు ఆరోపనలు ఉన్నాయి. కాగా వారం రోజుల క్రితమే ఎస్‌ఐ వద్ద డ్రైవర్‌గా చేరిన బీరప్పను బలిపశువు చేశారని కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి పీఎస్ ఎదుట ఆందోళన చేపట్టగా ఏసీబీ అధికారులు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు.



ఉత్సవ వివరాలను కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వివరిస్తున్న ఆలయ ఈఓ రాజేందర్‌రెడ్డి

సమన్వయంతో ఉత్సవాలు

- తాగునీటి సమస్య లేకుండా చర్యలు
- పోలేపల్లి ఎల్లమ్మ ఆలయాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్

దుద్యాల్: మండల పరిధిలోని పోలేపల్లి ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని బుధవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ రాజేందర్, చైర్మన్ జయరాములు ఉత్సవ వివరాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ నెల 20 నుంచి 24 నుంచి నిర్వహించనున్న జాతరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు, పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు సమన్వయంతో సమస్యలు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. త్వరితగతిన ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. టాయిలెట్స్ ఏర్పాట్లకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్‌ఐ యాదగిరి, ఆర్‌ఐ నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రంగరాజన్‌పై దాడి దారుణం



రంగరాజన్‌ను పరామర్శిస్తున్న డీడీఎన్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

- ప్రభుత్వం దుండగులను కఠినంగా శిక్షించాలి
- డీడీఎన్‌ఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ

కొడంగల్ రూరల్: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడిని దూప దీప నైవేద్య అర్చక సంఘం(డీడీఎన్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారీ ఖండించారు. బుధవారం వారు రాష్ట్రంలోని అన్ని జిల్లాల, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగరాజన్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామరాజ్యం పేరిట రౌడీ మూకలు దాడి చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రభుత్వం, పోలీసులు వారిని దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హిందూ ధర్మం పరిరక్షణకు, ఆలయాల మనుగడకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి.. అర్చకుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని అన్నారు. హైందవ ధర్మాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీడీఎన్‌ఎస్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటాద్రిస్వామి, ప్రసాద్‌శర్మ, భార్గవాచార్యులు, లక్ష్మీకాంతాచార్యులు, సంతోష్‌శాస్త్రి, శివప్రసాద్, శ్రీనివాస్, మొండయ్య, మహేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న నరేందర్‌రెడ్డి

బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేస్తాం

- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్ రూరల్/బొంరాస్‌పేట: రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేస్తామని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆయన మండల కేంద్రంలోని పార్టీ నాయకులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మండల పరిధిలోని చిన్న నందిగామకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు తలారి సాయప్పతో పాటు 30 మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. గ్రామ అధ్యక్షుడు తలారి మల్లేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరడం హర్షనీయమన్నారు.

శివపూజలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే

మండల పరిధిలోని జానకంపల్లిలోని శివస్వాముల పడిపూజ, అభిషేకం, హోమం కార్యక్రమాల్లో నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. శివస్వాములతో కలిసి భజన చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ వైస్ ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, పార్టీ నాయకులు మహేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మధుయాదవ్, నెహ్రూనాయక్, మహేందర్ తదితరులున్నారు.

అర్చకుడిపై దాడి కేసులో
మరో ఆరుగురి అరెస్ట్

- శ్రీకాకుళంలో ఐదుగురు, వరంగల్‌లో ఒకరిని పట్టుకున్న పోలీసులు
- భద్రాచలం వద్ద మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ ఆలయం అర్చకుడిపై జరిగిన దాడి కేసును పోలీసులు వేగంగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డితోపాటు మరో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు బుధవారం మరో ఆరుగురిని అరెస్టు చేశారు. వీరితో పాటు భద్రాచలం సమీపంలో మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. రామరాజ్యం సైన్యం పేరుతో 26 మంది ఈ నెల 7న చిలుకూరు బాలాజీ ఆలయానికి వచ్చి అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే. ఆయన ఫిర్యాదుతో మొయినాబాద్ పీఎస్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. రెండు బృందాలతో గాలింపు చేపట్టి 8న ప్రధాన నిందితుడిని అరెస్టు చేయగా మరుసటిరోజు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న 20 మంది కోసం రెండు బృందాలతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన వీరబాబు, మూర్తి, గోవిందరావు, ఎల్.వెంకటరమణ, ఎం.వెంకటరమణను బుధవారం అరెస్టు చేసి అక్కడి కోర్టులో హాజరు పర్చారు. అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. మరో బృందం తెలంగాణలో చేపడుతున్న గాలింపు చర్యల్లో భాగంగా నగరంలోని బోడుప్పల్‌కు చెందిన శ్రీనివాస్ అలియాస్ సేనను వరంగల్‌లో అరెస్టు చేశారు. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించి రిమాండ్‌కు తరలించారు.

పరారీలో మరో 14 మంది

ఈ దాడి కేసులో పోలీసులు మొత్తం 12 మందిని అరెస్టు చేశారు. మరో 14 మంది పరారీలోనే ఉన్నారు. వీరిలో భద్రాచలం వద్ద మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మిగిలిన వారి కోసం గాలింపు కొనసాగుతోంది.

వడివడిగా కడా అభివృద్ధి

భారీగా నిధుల మంజూరు

- మొదటి ఏడాదిలోనే రూ.6,128 కోట్లు
- నియోజకవర్గంలో రేవంత్ మార్క్



అభివృద్ధి పనులకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

కొడంగల్: రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తొలి ఏడాదిలోనే తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌కు రూ.6,128 కోట్లు మంజూరు చేశారు. అభివృద్ధి పనులు సైతం ఊపందుకున్నాయి. నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనదైన మార్క్‌ను చూపిస్తున్నారు. సీఎం సోదరుడు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. 2023 డిసెంబర్ 29న కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసి డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి వెంకట్‌రెడ్డిని ప్రత్యేకాధికారిగా నియమించారు. కడా ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యా ల, కోస్గి, మద్దూరు, కొత్తపల్లి, గుండుమాల్ మండలాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.2,945 కోట్లు

నియోజకవర్గంలో లక్షా పది వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రూ.2,945 కోట్లు మంజూరు చేశారు. దీని సామర్థ్యం పెంచి నిధులను రెట్టింపు చేయనున్నారు. అప్పాయిపల్లి శివారులో వెటర్నరీ కళాశాల నిర్మాణానికి రూ.360 కోట్లు మంజూరు చేశారు. రోడ్లు కల్వర్టుల నిర్మాణానికి రూ.345 కోట్లు, ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి రూ.7 కోట్లు, కొడంగల్ ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు మౌలిక సదుపాయాల కల్పనకు రూ.124.50 కోట్లు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కోసం రూ.46 కోట్లు, ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాల, పారామెడికల్ కళాశాల నిర్మాణాలకు రూ.27 కోట్లు మంజూరు చేశారు. కొడంగల్ ప్రభుత్వాసుపత్రిని విస్తరించి 220 బెడ్ల సామర్థ్యం కలిగిన టీచింగ్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి రూ.27 కోట్లు కేటాయించారు. వివిధ రకాల 30 పనులకు రూ.213 కోట్లు, ఎస్సీ గురుకుల పాఠశాల కొత్త భవనానికి రూ.45 కోట్లు, బీసీ గురుకుల పాఠశాల నూతన భవనానికి రూ.25 కోట్లు, మైనార్టీ గురుకుల పాఠశాల నూతన భవనానికి రూ.20 కోట్లు, గిరిజన గురుకులానికి రూ.18 కోట్లు, కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు. వాటి భవనాల నిర్మాణానికి రూ.20 కోట్లు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.10 కోట్లు కేటాయించారు. మహిళా డిగ్రీ కళాశాల నిర్మాణం కోసం రూ.11 కోట్లు, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల భవన నిర్మాణం మౌలిక సదుపాయాలకు ఒక్కో మండలానికి రూ.7.13 కోట్ల చొప్పున రెండు మండలాలకు కలిపి రూ.14.26 కోట్లు, వివిధ మండలాల్లో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల నిర్మాణానికి రూ.74 కోట్లు మంజూరు చేశారు. కొడంగల్ పెద్ద చెరువు ఆధునీకరణకు రూ.45 కోట్లు, కొడంగల్‌లోని పద్మావతీ సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి, కోస్గిలోని వేణుగోపాల స్వామి ఆలయాభివృద్ధికి రూ.18.5 కోట్లు, కడాకు రూ.80 కోట్లు, దుద్యాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రూ.2.40 కోట్లు, బీటీ రోడ్లకు రూ.20 కోట్లు, కొత్తపల్లి, గుండుమాల్‌లో జూనియర్ కళాశాలకు రూ.16 కోట్లు, బొంరాస్‌పేట మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులో హరిత రిసార్ట్ నిర్మాణానికి రూ.10 కోట్లు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రూ.100 కోట్లు, కోస్గి, కొడంగల్ పట్టణ ప్రాంతాల అభివృద్ధికి రూ.590 కోట్లు, కోస్గిలో రోడ్ల విస్తరణకు రూ.7 కోట్లు, మద్దూరులో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల భవనాలకు రూ.30 కోట్లు, నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి పెద్ద మొత్తంలో రూ.1,004 కోట్లు మంజూరు చేశారు. దౌల్తాబాద్ మండలం బాలంపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రూ.2.5 కోట్లు మంజూరు చేశారు. కొడంగల్ మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి సోలార్ వ్యవస్థను మంజూరు చేశారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం పూట పౌష్టికాహారం అందించడానికి హరే రామ హరే కృష్ణ మూవ్‌మెంట్‌కు బాధ్యతలు అప్పగించారు. 28 వేల మంది విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం అల్పాహారం అందిస్తున్నారు. భవిష్యత్‌లో కొడంగల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి రేవంత్ సర్కార్ అడుగులు వేస్తోందని ఈ ప్రాంత ప్రజలు భావిస్తున్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర సైన్స్ సెమినార్‌కు ఎంపికైన యాసిన్



అనంతగిరి: ఎస్సీఈఆర్టీ(రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి) ఆధ్వర్యంలో ఈనెల 28న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు బషీరాబాద్ జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు ఎండీ.యాసిన్ ఎంపికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా వందల దరఖాస్తులలో కమిటీ ఎంపిక చేసిన 31 మందిలో యాసిన్ ఒకరు. అభ్యసన పునర్బలనం కోసం సాంకేతిక క్రీడా పద్ధతి అంశంపై పరిశోధన చేసినందుకు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అరుదైన ఘనత పొందిన యాసిన్‌కు విద్యాధికారులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం ఈయన ఎస్సీఈఆర్టీలో ఫ్యాకల్టీగా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



భరత్‌కుమార్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: బైక్ అదుపుతప్పి కింద పడటంతో తీవ్ర గాయాలైన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక బృందావన్ కాలనీలో నివాసముండే భరత్‌కుమార్(25) నగర శివార్లలోని ఓ పెట్రోల్ బంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి డ్యూటీకి ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో బైక్ అదుపుతప్పి గుంతలోకి వెళ్లడంతో కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలైన భరత్‌కుమార్‌ను నగర శివార్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్టు

బ్యాంకు ఖాతాలు అందించిన నిందితులు

సాక్షి, సిటీబ్యూరో: ఉత్తరాదితో పాటు విదేశాల్లో ఉండి సైబర్ నేరాలకు పాల్పడుతున్న ప్రధాన నిందితులకు సహకరించిన ఇద్దరు నేరగాళ్లను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. నగరంతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వీరిని వేర్వేరు కేసుల్లో అరెస్టు చేసినట్లు అధికారులు బుధవారం ప్రకటించారు. ఏపీలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన పి.ఉమామహేష్ సైబర్ నేరగాళ్లకు తన బ్యాంకు ఖాతా ఇవ్వడంతో పాటు మరికొన్ని ఎకౌంట్ల వివరాలు ఇచ్చాడు. వీటిని వినియోగించి ప్రధాన సూత్రధారులు తెలంగాణలో మూడింటితో సహా దేశ వ్యాప్తంగా ఎనిమిది నేరాలు చేశారు. నగరానికి చెందిన ఓ 55 ఏళ్ల ఉద్యోగికి సోషల్ మీడియా ద్వారా ఎర వేశారు. గోల్డ్ ట్రేడింగ్‌లో సహకరిస్తామంటూ నమ్మబలికి ప్రత్యేక యాప్‌లో ఖాతా తెరిపించారు. బాధితుడి నుంచి దఫదఫాలుగా రూ.43.36 లక్షలు కాజేసిన నేరగాళ్లు ఆపై యాప్‌లోని ఖాతా పని చేయకుండా చేశారు. బాధితుడి నుంచి డబ్బు డిపాజిట్/బదిలీ చేయించుకోవడానికి వాడిన ఖాతాల్లో ఉమామహేష్ ఖాతా ఉంది. బాధితుడి ఫిర్యాదుతో నమోదైన కేసులో పోలీసులు ఉమా మహేష్‌ను అరెస్టు చేశారు. అలానే నగరానికి చెందిన మరో ప్రైవేట్ ఉద్యోగికీ సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ ద్వారా ఎర వేశారు. గూగుల్ రివ్యూలు, టాస్క్‌లు పూర్తి చేస్తే నగదు ఇస్తామని నమ్మించారు. ఆయన నుంచి రూ.25.36 లక్షలు కాజేసి మోసం చేశారు. ఇతడి నుంచి డబ్బు వెళ్లిన ఖాతాల్లో నగరానికి చెందిన సీహెచ్ నవీన్ ఖాతా కూడా ఉందని పోలీసులు గుర్తించారు. కమీషన్లకు ఆశపడి సైబర్ నేరగాళ్లతో కలిసి పని చేసినట్లు తేల్చారు. దీంతో ఇతగాడినీ అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

పాఠశాలకు ఫ్లోర్‌మాట్స్ అందజేత

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్లారి వైభవ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం బుధవారం నాయకుడు వైభవ్‌రెడ్డి ఫ్లోర్‌మాట్స్‌ను ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మామూళ్ల మత్తు.. నిబంధనలు చిత్తు

- పరిగిలో ఫుట్‌పాత్‌పై ఆక్రమణల జోరు
- ఇబ్బందులకు గురవుతున్న పాదచారులు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులు



ఫుట్‌పాత్‌పైనే నిర్వహిస్తున్న వ్యాపారాలు

పరిగి: ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో నడవడానికి తీవ్ర అవస్థలు పడుతున్నామని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిగి పట్టణంలో ఫుట్‌పాత్ మొత్తం ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు స్థానికంగా వ్యక్తం అవుతున్నాయి. పట్టణ కేంద్రం నుంచి బీజాపూర్ జాతీయ రహదారి వెళుతుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుకి ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారు. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన వీటిని వ్యాపారాలకు నిలయంగా మార్చుకుంటున్నారు. పట్టణంలో కొందరు తమ సామగ్రిని ఫుట్‌పాత్‌లపై పెట్టి దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. మరికొందరు ఫుట్‌పాత్‌ని ఆక్రమించి నిర్మాణాలు చేస్తూ పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. దీంతో జనం రోడ్డుపై నడవాల్సిన దుస్థితి ఏర్పడింది. నిత్యం రద్దీగా ఉంటే పరిగి ప్రాంతం ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు భయంతో రోడ్డు మీద నడవాల్సి వస్తుంది. ఎప్పుడు ఏ వాహనం వచ్చి ఢీ కొడుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ఆక్రమణకు గురవుతున్న స్థలాలను కాపాడాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. అనుమతులు లేకుండా ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుడడం గమనార్హం.

ఫుట్‌పాత్‌లే వ్యాపార నిలయాలు

కాలినడక కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌పై కొందరు దర్జాగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. బీజాపూర్ జాతీయ రహదారిపై పాదచారుల కోసం ఫుట్‌పాత్‌ను ఏర్పాటు చేశారు. కానీ ఏర్పాటు చేసిన నాటి నుంచి వీటిని పాదచారులు ఉపయోగించలేరు. ఎందుకంటే ఫుట్‌పాత్‌ను వ్యాపార నిలయాలుగా మార్చుతున్నారు. ఫుట్‌పై ఎవరిని నడవనీయకుండా చేస్తున్నారు. దీంతో చేసేది ఏమి లేక ప్రజలు రోడ్డుపైనే నడుస్తున్నారు. పరిగిలో దాదాపు 3 కిలోమీటర్ల మేర ఫుట్‌పాత్‌ను వ్యాపారస్తులు ఆక్రమించి తమ వ్యాపార సామగ్రిని ఉంచడంతో పాటు గోడలు కట్టి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. గతంలో జిల్లా కలెక్టర్ సైతం ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన సామగ్రిని తొలగించాలని గతంలో మున్సిపల్ అధికారులను ఆదేశించినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ.లక్షల్లో వసూలు

ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేయాలన్నా మున్సిపల్ అధికారులకు నెల నెల మామూళ్లు ఇవ్వాల్సిందే. చిన్నపాటి నిర్మాణాలు చేపట్టాలన్నా రూ.వేల నుంచి లక్షల వరకు వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరు నెలల క్రితం ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలు, సామగ్రిని అప్పట్లో తొలగించారు. దీంతో వ్యాపారస్తులు అధికారగణానికి మామూళ్లు ముట్టచెప్పడంతో యథావిధిగా కొనసాగుతున్నాయి. మున్సిపల్‌లో పనిచేసే కిందిస్థాయి సిబ్బందిలో ఓ వ్యక్తి.. ప్రతి నెలా ఒక్కో దుకాణం నుంచి స్థాయికి తగ్గట్టు రూ.వెయ్యి నుంచి రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఫుట్‌పాత్ వ్యాపారస్తుల నుంచే ప్రతి నెల రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అందుకే అధికారులు ఫుట్‌పాత్ ఆక్రమణలపై పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన వ్యాపారస్తులపై వెంటనే చర్యలు తీసుకుంటాం. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వెలిసిన నిర్మాణాలను కూల్చివేస్తాం. స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఎంతటి వారైన వదిలే ప్రసక్తే లేదు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలను తొలగిస్తాం.

– వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్, పరిగి

చదువుతో పాటు క్రీడలు ముఖ్యం

ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి



క్రీడలను ప్రారంభిస్తున్న ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

పూడూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో మహిళా సాధికారత కేంద్రంలో బేటీ బచావో బేటీ పడావో పది సంవత్సరాల వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా పరిగి నియోజకవర్గ పరిధిలోని కేజీబీవీల్లోని విద్యార్థులకు క్రీడాపోటీలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు ట్రైనీ కలెక్టర్ జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. క్రీడలతో మానసికంగా ఎదుగుదలతో పాటు శారీర దృఢత్వం పెంపొందుతుందన్నారు. క్రీడలకు సమయం కేటాయించాలని సూచించారు. ఈ పోటీల్లో దోమ కేజీబీవీ విద్యార్థులు కబడ్డీలో మొదటి స్థానంలో నిలిచారు. పూడూరు కేజీబీవీ విద్యార్థులు ఖోఖోలో మొదటి స్థానం సాధించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యాదవుల అభ్యున్నతికి కృషి



నూతన కార్యవర్గసభ్యులతో యాదయ్యయాదవ్

అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదయ్యయాదవ్

దోమ: యాదవుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్యయాదవ్ అన్నారు. బుధవారం దోమలో ఆ సంఘం మండల కమిటీని ఆయన ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా బొంపల్లి గ్రామానికి చెందిన ముద్దం నర్సింహాయాదవ్, గౌరవ అధ్యక్షుడిగా తిరుపతయ్యయాదవ్, ఉపాధ్యక్షులుగా బాల్‌రాజ్‌యాదవ్, మల్లేశ్‌యాదవ్, యూత్ అధ్యక్షుడిగా వెంకటేశ్‌యాదవ్, యూత్ ఉపాధ్యక్షుడిగా నరేశ్‌యాదవ్‌తో పాటు పలువురిని సభ్యులుగా తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవులు ఐకమత్యంగా ఉంటూ ప్రభుత్వం ఇచ్చే పథకాలను అందిపుచ్చుకోవాలన్నారు. రిజర్వేషన్ల పరంగా పదవులను కేటాయించుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గ్రామస్థాయి నుంచి యాదవులు బలోపేతం అయ్యే విధంగా ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రామకృష్ణయాదవ్, బస్వరాజ్‌యాదవ్, వెంకటేశ్ యాదవ్, పవన్‌యాదవ్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యకు ప్రాధాన్యమివ్వాలి

తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య డిమాండ్



సమావేశం మాట్లాడుతున్న నాయకురాలు కృప

అనంతగిరి: రాష్ట్ర బడ్జెట్లో విద్య కోసం కనీసం 15 శాతం కేటాయించాలని తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య రాష్ట్ర నాయకులు కృప డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం వికారాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే విద్యకు ఎన్నో నిధులు కేటాయిస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నామన్నారు. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం అలాంటి చర్యలకు వెళ్లడం లేదన్నారు. ప్రభుత్వ విద్య సంస్థలలో కనీస వసతులు కల్పించాలన్నారు. వికారాబాద్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనం నిర్మించాలన్నారు. స్కాలర్‌షిపులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించి విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు శివరాజు, నాగరాజు, సానియా, రేణుక, సంజన, సతీష్, నర్సింలు, యాదయ్య, శ్రీనివాస్, ఆశలత, దేవకుమారి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి



క్రీడాకారులకు జెర్సీలను అందజేసిన నర్సింహారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి సూచించారు. కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి హర్షలత ఆధ్వర్యంలో ఆర్‌కేపురంలో నిర్వహించిన తెలంగాణ ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలకు బుధవారం నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు జెర్సీలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత మృతిపై కేసు

బంట్వారం: అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వివాహిత మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తొర్మామిడి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీశైలంయాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సైఫ్‌ఖాన్‌కు కొడంగల్‌కు చెందిన ముస్కాన్‌బేగం(21)తో కొన్నేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఓ బిడ్డ సంతానం. ఇటీవల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ముస్కాన్‌బేగంను కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆమె మంగళవారం మృతి చెందింది. కూతురు మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ తండ్రి షేక్ జమీరోద్దీన్ బుధవారం బంట్వారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహానికి పోస్టుమార్టం జరిపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేగంతో కారు పల్టీ.. త్రుటిలో తప్పిన ప్రమాదం



ఘటనా స్థలిలో కారు

కందుకూరు: అతివేగంగా వెళ్తున్న ఓ కారు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని, డివైడర్‌ను ఢీకొట్టి బ్రిడ్జ్ పైనుంచి కింద పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. ఇబ్రహీంపట్నం పటేల్‌గూడకు చెందిన రాజేష్‌గౌడ్ నిత్యం మండల పరిధిలోని ఎన్టీఆర్‌తండా సమీపంలోని ఓ రైతు నుంచి పాలను సేకరించి హైదరాబాద్‌కు కారులో తీసుకెళ్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం పాలను తీసుకుని కారులో ఫార్మా రహదారిపై బయలుదేరాడు. కొంత సేపటికే కందుకూరు సోమదేవుని చెరువు ముందు అతివేగంగా కారును నడుపుతూ డివైడర్, ముందున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి పల్టీ కొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న యాచారం మండలం కుర్మిద్దకు చెందిన ప్రవీణ్‌నాయక్‌తో పాటు కారులో ఉన్న రాజేష్‌గౌడ్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో స్థానికులు నగరంలోని ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



కొండపైన ఉన్న షర్ఫుద్దీన్ బాబా దర్గా



అలంకరణలో దర్గా కమాన్

బర్డ్ ఫ్లూ కలవరం!



మంచాలలోని ఓ ఫారంలో కోళ్లను పరిశీలిస్తున్న పశు వైద్యాధికారులు

- గ్రామాల్లో ఆందోళన చెందుతున్న పౌల్ట్రీ రైతులు
- భయపడొద్దని పశు సంవర్ధక అధికారుల సూచన

మంచాల: గ్రామీణ ప్రాంతాల్లోని పౌల్ట్రీ రైతులను కొత్త భయం వెంటాడుతోంది. ఇటీవల ఏపీలో బర్డ్ ఫ్లూ సోకి కోళ్లు మృత్యువాత పడడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు పశు సంవర్ధకశాఖ అధికారులు బర్డ్ ఫ్లూ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. అలాగే క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మంచాల మండలంలో అధికారుల లెక్కల ప్రకారం 357 బ్రాయిలర్ కోళ్ల ఫారంలు ఉన్నాయి. వాటిలో 32 లక్షలకు పైగా కోళ్లను పెంచుతున్నట్లు సమాచారం. అదే విధంగా 12 లేయర్ ఫారంలు ఉండగా వాటిలో 7 లక్షలకు కోళ్లను పెంచుతున్నారు. ఇప్పటికే వేసవి ఎండల దృష్ట్యా చాలా కోళ్ల ఫారాలకు కోడి పిల్లలు ఇవ్వలేదు. మరోవైపు కోళ్లున్న ఫారాల రైతులకు మాత్రం బర్డ్ ఫ్లూ వైరస్ భయందోళన కలిగిస్తోంది.

తగ్గిన ధరలు

గ్రామాల్లో బర్డ్ ఫ్లూ వ్యాధి గురించి పశుసంవర్ధక శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. కోళ్ల ఫారాలకు సంబంధించిన ఏజెన్సీల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకొని పరిశీలన చేస్తున్నారు. చనిపోయిన కోళ్లను కూడా పరిశీలన చేసి ఏమాత్రం అనుమానం వచ్చినా ఉన్నతాధికారులకు సమాచారం అందించి పరీక్షలకు పంపిస్తామని తెలుపుతున్నారు. మరోవైపు గ్రామాల్లో బర్డ్ ఫ్లూ భయం చక్కర్లు కొడుతోంది. చికెన్ తినేవారు ఒకింత జంకుతున్నారు. కొనుగోలు శాతం కొంతమేర తగ్గిందని చికెన్ విక్రయదారులు చెబుతున్నారు. పదిహేను రోజుల క్రితం కిలో రూ.250 ఉండే, ప్రస్తుతం రూ.196 నుంచి రూ.200 వరకు చికెన్ ధర పడిపోయింది.

పరిశీలన చేస్తున్నాం



ఇప్పటివరకు మండలంలో బర్డ్ ఫ్లూ సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదు. సాధారణ స్థాయి కంటే ఎక్కువ చనిపోతే ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తాం. అప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన బృందం వస్తుంది. శాంపిల్ సేకరించి పరీక్షల చేస్తుంది. బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయితే చనిపోయిన కోళ్లను పెద్ద గొయ్యి తీసి పాతి పెట్టాలి. అలాంటి పరిస్థితి లేదు. ప్రస్తుతం ఎవరూ భయందోళనకు గురి కావొద్దు.

– సుధారెడ్డి, పశువైద్యాధికారి, మంచాల

ఉర్సుకు సర్వం సిద్ధం

- ముస్తాబైన పహాడీషరీఫ్ దర్గా
- 15 నుంచి వారం పాటు ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

పహాడీషరీఫ్: చారిత్రక నేపథ్యం కలిగిన పహాడీషరీఫ్ బాబా షర్ఫుద్దీన్ దర్గా 759వ ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైంది. అన్ని వర్గాల ప్రజలతో నిత్యం కళకళలాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఈ దర్గాలో ఏటా ఉర్సు వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. వక్ఫ్‌బోర్డు ఆధీనంలో ఉన్న ఈ దర్గాను పీర్‌జాదుగన్‌లు పర్యవేక్షిస్తూ వస్తున్నారు. బాబా షర్ఫుద్దీన్ దర్గాను దర్శించుకుంటే ఆయురారోగ్యాలతో వర్థిల్లడంతో పాటు అనుకున్న కార్యం నెరవేరుతుందన్న నమ్మకంతో ప్రజలు ఇక్కడ పెద్ద ఎత్తున గ్యార్మీ షరీఫ్‌లు నిర్వహించడం అనాధిగా వస్తుంది. భక్తులు దర్గాలోని బాబా సమాధికి పూలు, చాదర్ సమర్పించి మొక్కులు తీర్చుకుంటుంటారు. ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలను పురస్కరించుకొని దర్గా ఆవరణలో పెద్ద ఎత్తున దుకాణాలు, రంగుల రట్నాలు వెలిశాయి.

కార్యక్రమాలు ఇవే..

- ఈ నెల 15న రాత్రి దర్గాలో నిర్వహించే ఖసీదయే బుర్దాషరీఫ్‌తో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.
- అదేరోజు అర్ధరాత్రి 12 గంటలకు బాలాపూర్ గ్రామంలోని చిల్లా నుంచి భక్తుల కోలాహలం నడుమ గంధం ఊరేగింపు ప్రారంభమవుతోంది. అక్కడి నుంచి కొత్తపేట, వెంకటాపూర్, షాహిన్‌నగర్, జల్‌పల్లి కమాన్ ప్రాంతం సమీపంలోని దర్గా శక్కర్ షా వలీ వద్ద ఫజర్ నమాజ్ నిర్వహిస్తారు. అక్కడి నుంచి కొనసాగింపుగా 16వ తేదీన ఉదయం 8 గంటలకు దర్గాపైకి ఊరేగింపు వెళుతోంది.
- 18న రాత్రి చార్మినార్ సమీపంలోని పంజెషా నుంచి నిజాం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యే గంధం ఊరేగింపు మరుసటి రోజు ఉదయం పహాడీషరీఫ్ దర్గాకు చేరుకుంటుంది.
- 19న రాత్రి 7 గంటలకు దీపాల కార్యక్రమం ఉంటుంది.
- 20న రాత్రి పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ నుంచి ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న అధికారి పోలీస్ సందల్‌లో భాగంగా పూలు, చాదర్ తలపై పెట్టుకొని ఊరేగింపుగా వచ్చి సమర్పిస్తారు.
- 21న నిర్వహించే ఉస్లే షరీఫ్ (పూల మాలల సమర్పణ)తో ఈ ఉర్సు ఉత్సవాలు ముగుస్తాయి.

నేపథ్యం ఇదీ..

759 ఏళ్ల క్రితం ఇరాక్ దేశస్థుడైన కుతుబ్-హుల్-అక్తాబ్ షహెన్‌షా-ఇ-దక్కన్ సుల్తాన్-ఉల్ ఆరిఫీన్ హజ్రత్ బాబా షర్ఫుద్దీన్ మన దేశానికి వచ్చి పహాడీషరీఫ్ గ్రామంలోని ఎత్తైన కొండపై దట్టమైన అడవి, క్రూర మృగాలు, విష సర్పాల సంచారం నడుమ ప్రార్థనలు ప్రారంభించాడు. అలాంటి వాతావరణంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్న సమయంలో బాబా షర్ఫుద్దీన్ ప్రార్థనలను చూసి భక్తులు ఆయనను ఆరాధించడం మొదలెట్టినట్లు ప్రాచుర్యంలో ఉంది. మన దేశ పర్యటనలో భాగంగా బాబా మొదటిసారిగా బాలాపూర్ గ్రామంలో విశ్రాంతి తీసుకొని అక్కడి నుంచి పహాడీషరీఫ్ గ్రామానికి చేరుకొని ఈ కొండపైకి మకాం మార్చారు. ఇందులో భాగంగానే మొదటి గంధాన్ని బాలాపూర్ నుంచి తీస్తున్నారు.

360 మెట్లే ప్రత్యేక ఆకర్షణ

పహాడీషరీఫ్ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దర్గాకు 360 మెట్లు ప్రత్యేక ఆకర్షణ అని స్థానికులు చెబుతుంటారు. పూర్వం హైదరాబాద్ నిజాం నవాబు మహబూబ్ అలీ బాబా దర్శించుకునేందుకు వచ్చిన సమయంలో సుమారు వెయ్యి అడుగుల ఎత్తులో ఉన్న ఈ దర్గాకు సరైన మార్గం లేదు. దర్గాకు పైకి ఎక్కే సమయంలో నిజాం నవాబు కాలికి గాయమైంది. దీంతో రాజునైన తనకే గాయాలైతే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని దర్గాకు 360 మెట్లు, పక్కనే మసీదును నిర్మించారు. నిజాం కాలంలో నిర్మించిన మెట్లు నేటికి చెక్కు చెదరకుండా ఉండటం విశేషం.



వైభవంగా నిర్వహిస్తాం



ఈసారి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం. బాబా మొదటిసారి బాలాపూర్‌కు వచ్చిన గుర్తుగా ఏటా చిల్లా నుంచి మొదలుకొని పహాడీషరీఫ్ వరకు గంధం తీసుకొని కాలినడకన భక్తులు దర్గాలోకి ప్రవేశిస్తారు. బాబా ఆశీస్సులతో ఎంతో మంది రాజకీయ, వ్యాపార రంగాల్లో కొనసాగుతున్నారు. ఇక్కడ నిత్యన్నదానంపై ఆధారపడి వందలాది మంది యాచకులు జీవిస్తున్నారు.

– సయ్యద్ ఫరీదుద్దీన్ సువర్‌వర్దీ, దర్గా పర్యవేక్షకుడు

సదుపాయాలు కల్పించాం



ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని మున్సిపాలిటీ తరఫున అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాం. ఇందుకోసం రూ.5 లక్షల నిధులు కేటాయించాం. ప్రత్యేకంగా మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసి హెల్త్, ఎలక్ట్రికల్, ఫైర్, పోలీస్, వాటర్‌వర్క్స్, ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేస్తున్నాం. పారిశుధ్యం, నీటి సరఫరా సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

– వెంకట్రామ్, కమిషనర్, జల్‌పల్లి మున్సిపాలిటీ

గట్టి బందోబస్తు



ముఖ్యంగా 15వ తేదీన రాత్రి ప్రధాన ఊరేగింపు రోజు దారి పొడవునా ఆర్మీ ఫోర్స్, రోప్ పార్టీలతో ఉన్నతాధికారుల పర్యవేక్షణలో బందోబస్తు కొనసాగుతోంది. దర్గా నిర్వాహకులు కూడా వాలంటీర్లను నియమించుకోవాలి. ఈ ఉత్సవాలకు అందరూ సహకరించి శాంతియుతంగా జరుపుకోవాలి. సంప్రదాయంలో భాగంగా పోలీస్‌స్టేషన్ నుంచి గంధం ఊరేగింపు నిర్వహిస్తాం.

– గురువారెడ్డి, ఇన్‌స్పెక్టర్, పహాడీషరీఫ్